# ప్రజా పిశాచాలు

ఒకానొక దేశంలో గ్రహచారం బాగాలేక ప్రజాస్వామ్య వ్యవస్థ ఏర్పడింది. అకస్మాత్తుగా ప్రజలను తమ పాలకులను ఎన్నుకోమంటే, తమను అంతవరదాకా నేలబెట్టి కాలరాచిన ప్రభువులనే ఎన్నుకున్నారు. వాళ్లు తప్ప మరొకరు అధికారం చలాయించటం ప్రజలు ఊహించలేకపోయారు.

అయినప్పటికీ ప్రభువులు తమ భవిష్యత్తు గురించి బెంగపడక తప్పలేదు. ఇవాళ కాకపోతే రేపైనా ప్రజలు తెలివి మీరి తమ అధికారాలు గుర్తిస్తారు. అప్పుడు తమ గతి ఏంకాను?

"ప్రజలను అదుపులో పెట్టే సాధనం కావాలి" అన్నాడొక ప్రభుభక్తి పరాయణుడు.

"మత విశ్వాసాలను తదనుగుణంగా మార్చి పురాణాలూ, హరికథలూ చెప్పాలి. రాజభక్తి అన్నదానికి ఇంకా విలువ ఉన్నట్టు కథలూ అవీ రాసి పసి పిల్లల దగ్గర నుంచీ నూరిపోయాలి. దేశభక్తి అన్నదాన్ని తొక్కిపెట్టాలి" అన్నాడు మాజీ ఆస్థాన సిద్ధాంతి.

"చాలదు!" అన్నాడు ప్రభువు ముక్తసరిగా.

"ప్రజలను తారెత్తించటానికి పిశాచాలను తయారుచెయ్యాలి" అన్నాడు సేనాపతి.

"పిశాచాలెక్కడున్నాయి? కథలు చెప్పకు."

"పిశాచాలు మనలోనే ఉన్నాయి. వాటిని తరిఫీదు చెయ్యాలి అంతే - రక్షక భటుడు అనే మాటకు ప్రజాస్వామ్యంలో అర్థం ఉండదు. వాణ్ని కొద్ది శ్రమతో మానవత్వంలేని పిశాచంగా తయారు చేయవచ్చు. వాడికి చంపటంలోనూ, చిత్రహింసలు చెయ్యటంలోనూ, మనుషుల అర్తనాదాలు గంధర్వంగానంలా వినిపించేటట్టు చెయ్యటంలోనూ తరిఫీదు ఇయ్యవచ్చు. ఏదో అవకాశం దొరికితే చాలు మనుషుల కీళ్లు విరగగొట్టటమూ, వాళ్ల ఆహారంలో ఉచ్చపొయ్యటమూ, దాహంతో బాధపడుతుంటే వాళ్లకు అందకుండా నీరు ఉంచటమూ, ఆడవాళ్లను చెరచటమూ, ఖైదులో ఉన్న వాళ్లను కాల్చి చంపి, పొలిమేర దగ్గర పారెయ్యటమూ - ఇలాటి సవాలక్ష పైశాచిక కృత్యాలు వాళ్లు తమ ఆనందం కోసం చెయ్యాలి. ఆజ్ఞాపించి చేయించవచ్చును. గాని కొంతకాలానికి వాళ్లు తిరగబడే అవకాశం ఉంది. అందుచేత పిశాచత్వం వాళ్ల ప్రవృత్తి అయేలా ఒక

సిబ్బందిని తయారుచెయ్యాలి. వాళ్లకు వాళ్లుగా పెద్ద జీతాలు అక్కర్లేదు. జనాన్ని చెండుకు తినటం నేర్పాలి. వాళ్లకు ప్రభుభక్తి, అంటే తమ పై వాళ్ల పట్ల కుక్కల్లా ప్రవర్తించే గుణం కూడా నేర్పాలి" అన్నాడు. అందరూ కరతాళధ్వనులు చేసి, "గ్రేట్! గ్రేట్!" అన్నారు.

***ముద్రణ : ఫిబ్రవరి 1976***